డిపో అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్ఎం విజయభాను

ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆర్ఎం

- ఎనిమిది గంటలు డిపోలోనే విజయభాను
- అధికారులు, సిబ్బందితో సమీక్ష
- రాత్రి వరకు సాగిన సమావేశాలు
- 'నమస్తే' కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్

జయశంకర్ భూపాలపల్లి. సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): భూపాలపల్లి ఆర్టీసీ డిపోను సోమవారం ఆర్ఎం విజయభాను సందర్శించారు. ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో 'నిర్లక్ష్యపు కోరల్లో భూపాలపల్లి ఆర్టీసీ డిపో ' కథనానికి ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు డిపోకు వచ్చిన ఆర్ఎం బృందం ఎనిమిది గంటలపాటు సమీక్ష నిర్వహించారు. అధికారులు, సిబ్బందితో వేర్వేరుగా సమీక్ష నిర్వహించి డిపో స్థితిగతులపై ఆరా తీశారు. డిపోకు సంబంధించిన విషయాలు పత్రికలకు ఎవరు చెప్తున్నారు? ఇది సరైన పద్ధతి కాదని ఉద్యోగులను మందలించినట్లు తెలిసింది. డిపోలో ఖాళీగా ఉన్న పోస్టులు, బస్సుల పరిస్థితి, రోజువారీ బస్సుల్లో ఎంత మంది ప్రయాణిస్తున్నారు? ఎంత ఆదాయం వస్తున్నది? ఎంత మంది మహిళలు ప్రయాణిస్తున్నారు? డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సెక్షన్‌లో కొరత ఎంత అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. డిపోలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. డిపోలో లైట్లు సరిగా లేవని, మోటర్ కాలిపోయిందని, సిబ్బంది స్కూటర్ షెడ్డు లేదని, ఆర్‌వో ప్లాంట్ రిపేరులో ఉందని తదితర సమస్యలు ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లారు. వారం రోజుల్లో డిపోకు డీఎంను నియమిస్తామని, డ్రైవర్లు, కండక్టర్ల నియామకాలు త్వరలోనే జరుగుతాయని, కొత్త బస్సులు సైతం వస్తాయని ఆర్ఎం తెలిపారు.

'మహాలక్ష్మీ'తో రీజియన్‌లో రూ.328 కోట్ల భారం

మహాలక్ష్మి పథకం ద్వారా వరంగల్ రీజియన్‌లో రూ. 328 కోట్ల భారం పడుతున్నదని ఆర్ఎం విజయభాను తెలిపారు. డిసెంబర్ 15 నుంచి ఇప్పటి వరకు పథకం ద్వారా వరంగల్ రీజియన్‌లో 7.38 కోట్ల మంది మహిళలు ప్రయాణించారని, ప్రభుత్వం సంస్థకు రూ.328 కోట్లు చెల్లించిందని తెలిపారు. భూపాలపల్లి డిపో నుంచి 66.48 లక్షల మంది మహిళలు ప్రయాణించగా ప్రభుత్వం రూ.34.49 కోట్లు చెల్లించిందన్నారు. రీజియన్‌లోని అన్ని డిపోలు లాభాల్లోనే కొనసాగుతున్నాయని, వరంగల్ 2 డిపో కొంత వెనుకబడిందని తెలిపారు. కొత్తగా 82 ఎలక్ట్రిక్ బస్సులు అలాట్ అయ్యాయని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. అలాగే 10 డీలక్స్ బస్సులు, 4 సెమీ డీలక్స్ బస్సులు వచ్చాయన్నారు. ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్స్) భానుకిరణ్, రీజినల్ అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి, భూపాలపల్లి డిపో ఇన్‌చార్జి మేనేజర్ రవిచంద్ర ఉన్నారు.

గిరిజన దర్బార్‌లో వినతుల స్వీకరణ

వినతులను పరిశీలిస్తున్న పీవో చిత్రమిశ్రా

ఏటూరునాగారం: ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పలు ప్రాంతాల గిరిజనులు తమ వినతులను పీవో చిత్రమిశ్రాకు సమర్పించారు. భర్త యాలం పాపయ్య చనిపోయాడని, తనకు ఉద్యోగం ఇవ్వాలని మహబూబాబాద్ జిల్లా రాజోలుకు చెందిన యాలం లక్ష్మి వినతిపత్రం అందజేశారు. గిరివికాసం కింద వేసుకున్న బోరుకు కరెంటు కనెక్షన్ ఇవ్వాలని తాడ్వాయికి చెందిన ఆలెం నవీన్ కుమార్ కోరారు. తండ్రి వెంకన్న పేరుపై ఉన్న ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టా భూమిని తన పేరుపై మార్చాలని కుమార్తె సంధ్యారాణి వినతిపత్రం అందజేశారు. తాడ్వాయి మండలం వీరాపురం గ్రామం నగర చెరువు మత్తడికి తాత్కాలిక మరమ్మతులు చేయాలని కోరారు. గోవిందరావుపేట మండలం పస్రాకు చెందిన ఏసు జయప్రకాశ్ కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం కోసం వినతిపత్రం అందజేశారు. ఇంకా సీఆర్‌టీల బదిలీలు, ఉద్యోగాలు, ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టా భూములు మార్పిడి చేయాలని, పట్టాలు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో స్టాటిస్టికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ అనీల్, ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎడపల్లిలో ఇంటింటికీ వర్మీకంపోస్ట్ విక్రయం

మహదేవపూర్, సెప్టెంబర్ 30: మండలంలోని ఎడపల్లి గ్రామంలో జీపీ ఆధ్వర్యంలో తయారు చేసిన వర్మీ కంపోస్ట్‌ను స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి కార్యదర్శి రమేశ్ సోమవారం ఇంటింటికీ తిరుగుతూ విక్రయించారు. వర్మీ కంపోస్ట్ తయారీ విధానం, ఉపయోగాలను ప్రజలకు వివరించారు.రోడ్లపై చెత్త వేయొద్దని, గ్రామ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. అలాగే మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మానవహారం నిర్వహించారు.

ఆర్థిక స్వావలంబనకు మహిళా శక్తి క్యాంటీన్లు

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 30 : మహిళా శక్తి క్యాంటీన్లు మహిళలకు ఆర్థికంగా స్వావలంబన సాధించే దిశగా మారనున్నాయని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటులో శిక్షణ పూర్తి చేసుకున్న మండల సమాఖ్య సభ్యులు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ పూర్తిచేసిన వారికి ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మహిళలను వ్యాపారవేత్తలుగా తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్‌మెంట్ చేశారు. మొత్తం 57 ఫిర్యాదులు వచ్చాయని, ప్రతి శాఖలో నోడల్ అధికారిని నియమించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, రానున్న ప్రజావాణిలో దరఖాస్తుల పరిష్కార నివేదికలతో హాజరు కావాలని అధికారులను ఆదేశించారు.

కుక్కల వృద్ధి నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

కుక్కల వృద్ధి నియంత్రణకు శస్త్ర చికిత్స కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం ఆయన మున్సిపల్, పశు సంవర్ధక శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వీధి కుక్కల సంఖ్య పెరుగుతుండటంతో ప్రజలు కుక్క కాటుకు గురవుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కుక్కల జనన నియంత్రణ కేంద్రం (ABC సెంటర్) ఏర్పాటు చేయాలని సూచించారు. వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు చేయాలని, అనంతరం తిరిగి అదే ప్రాంతంలో క్షేమంగా వదిలిపెట్టాలని అధికారులను ఆదేశించారు.

బతుకమ్మ సంబురాలకు ఏర్పాట్లు చేయండి

బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. బతుకమ్మ సంబురాలు, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా అక్టోబర్ 2న ప్రత్యేక గ్రామసభల నిర్వహణ, పలు అంశాలపై సోమవారం ఎంపీడీవోలు, ఎంపీవోలు, కార్యదర్శులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి మండలంలో బతుకమ్మ వేడుకలు విజయవంతంగా నిర్వహించడానికి అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అక్టోబర్ 17నుంచి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 2న పారిశుధ్య కార్మికులకు సన్మానం, మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పశు సంవర్ధకశాఖ అధికారి కుమారస్వామి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, డీఆర్డీవో అవినాశ్, డీపీవో నారాయణరావు, ఏపీడీ గోవిందరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వద్దు

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దివాకర, అధికారులు

ములుగురూరల్, సెప్టెంబర్ 30: ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం చేయవద్దని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. మొత్తం 51 దరఖాస్తులు వచ్చాయని, కొన్నింటిని పరిష్కరించి, మిగతా వాటిని ఆయా శాఖల అధికారులకు రెఫర్ చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, డీపీఆర్వో రఫీక్, అధికారులు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన కల్పించాలి

రక్తహీనత వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'అనిమియా ముక్త్ తెలంగాణ' పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 1-19 ఏండ్ల పిల్లల రక్తహీనత తగ్గించే బాధ్యత వైద్యారోగ్య శాఖ, ఐసీడీఎస్, విద్యాశాఖపై ఉందన్నారు. అదనపు కలెక్టర్‌లు మహేందర్‌జీ, సంపత్‌రావు, డీఎంహెచ్‌వో అల్లం అప్పయ్య, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సహాయకులను నియమించాలని వినతి

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించేందుకు తాత్కాలిక సిబ్బందిని గ్రామస్థాయిలో సహాయకులుగా నియమించాలని వ్యవసాయ అధికారులు సోమవారం కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందజేశారు.

'ఓపెన్' పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

ములుగురూరల్, సెప్టెంబర్ 30: ఓపెన్ టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఈ నెల 3 నుంచి 9 వరకు నిర్వహించనున్న పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. సోమవారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బండారుపల్లి మోడల్ పాఠశాలలో పరీక్షలు ఉంటాయన్నారు. 29మంది ఇంటర్, 106 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. సమావేశంలో జిల్లా పరీక్షల నిర్వాహణ అధికారి జయదేవ్, డీపీఆర్వో రఫీక్, అధికారులు ఉన్నారు.

ఉమర్‌ఖాన్ భూముల పట్టాలకు కార్యాచరణ

రామచంద్రాపురంలోని ఉమర్‌ఖాన్ భూముల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. సోమవారం తన చాంబర్‌లో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రామచంద్రాపురం, ముద్దునూరుతండా, కొడిశలకుంట, గుర్తూరుతండా, భూపాల్‌నగర్, శివతండాల్లో నేటి నుంచి 8 వరకు గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద భూ సమస్యలపై రైతులు అధికారులకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇప్పటికే 500లకు పైగా దరఖాస్తులు వచ్చాయని, కంప్యూటరీకరణ జరుగుతోందన్నారు. గతంలో దరఖాస్తు చేయని రైతులు తేదీల వారీగా జీపీ కార్యాలయాల వద్ద అందిస్తే గ్రామాల్లో పర్యటించి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సిద్ధం చేస్తారని తెలిపారు. వాటి ఆధారంగా సమస్యలను దశల వారీగా పరిష్కరించి భూములపై హక్కులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో వయోవృద్ధుల దినోత్సవం

ములుగురూరల్, సెప్టెంబర్ 30: అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో నేడు ఉదయం 11గంటలకు నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీడబ్ల్యూవో శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వయోవృద్ధులు, అసోసియేషన్ సభ్యులు, ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు పాల్గొనాలని సూచించారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

సందీప్ (ఫైల్)

తాడ్వాయి, సెప్టెంబర్ 30: మండలంలోని బీరెల్లి గ్రామానికి చెందిన మంతెన సందీప్(26) హైదరాబాద్‌లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. సందీప్‌తో పాటు కుటుంబ సభ్యులు బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సందీప్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు చూసి దవాఖాకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు.

చిత్తశుద్ధితో సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 30 : ప్రజల ఫిర్యాదులను చిత్తశుద్ధితో పరిష్కరించాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివస్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 16మందితో ఎస్పీ మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకొని, సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశించారు. చట్ట వ్యతిరేకమైన చర్యలతో శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్‌ఖరే

జర్నలిస్టుల ఇండ్ల స్థలాలకు హద్దులు చూపాలి

మహదేవపూర్(కాళేశ్వరం), సెప్టెంబర్ 30 : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని వర్కింగ్ జర్నలిస్టులకు రెవెన్యూ శాఖ ద్వారా పట్టాలు అందజేసిన ఇండ్ల స్థలాలకు హద్దులు చూపాలని కోరుతూ కాళేశ్వరం జర్నలిస్టులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం ఇచ్చారు. కాళేశ్వరం శివారులోని 119/1 లో 12 మంది వర్కింగ్ జర్నలిస్టులకు ఒక్కొక్కరికి 121 గజాల చొప్పున ఇంటి స్థలం కేటాయించి పట్టాలు సైతం ఇచ్చారని, ఆ స్థలంలో అటవీశాఖ అధికారులు రిజర్వ్ ఫారెస్ట్ భూమి అని తమను అడ్డుకుంటున్నారని వివరించారు. రెవెన్యూ, అటవీశాఖ సంయక్తంగా సర్వే చేపట్టి తమకు ఇంటి స్థలాల హద్దులు కేటాయించాలన్నారు.

టేకు కలప స్వాధీనం

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబర్ 30: మండలంలోని కలిపాక అటవీ ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన టేకు కలపను సోమవారం అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలుబాక సెక్షన్ అధికారి చంద్రమోహన్ కథనం ప్రకారం.. కలిపాక అటవీ ప్రాంతంలో టేకు కలపను దాచారని అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశారు. సుమారు రూ.1.50లక్షల విలువ చేసే ఏడు టేకు దిమ్మలను స్వాధీనం చేసుకున్నామని, మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో బీట్ ఆఫీసర్ మానిక, సిబ్బంది లక్ష్మయ్య, బేస్‌క్యాంపు సిబ్బంది ఉన్నారు.

బాలసదనంలో డీఐసీ సభ్యుల తనిఖీ

ములుగురూరల్, సెప్టెంబర్ 30: ములుగులోని బాలసదనాన్ని డిస్ట్రిక్ట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ(డీఐసీ) సభ్యులు సోమవారం తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ మహేందర్‌జీ బాల సదనం ద్వారా అందుతున్న సేవలు, బాలల ఆరోగ్య పరిస్థితులు, సౌకర్యాలపై సభ్యులతో కలిసి సమీక్షించారు. బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, డీఐసీ సభ్యుడు పింగిలి నాగరాజు, డాక్టర్ నమ్రత, రాజు, సిబ్బంది ఉన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ములుగురూరల్, సెప్టెంబర్ 30: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బండారుపల్లి టీజీఆర్ఎస్ గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ స్వామిదాస్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పుట్ట మధు

కాటారం/ మహదేవపూర్, సెప్టెంబర్ 30 : కాటారం, మహదేవపూర్ మండలాల్లోని బాధిత కుటుంబాలను సోమవారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. కాటారం మండలం కొత్తపల్లిలో కుంభం రాంరెడ్డి ఇటీవల మృతి చెందగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మహదేవపూర్ మండలం బొమ్మాపూర్‌లో సర్పంచ్ ఓడేటి పద్మా రవీందర్‌రెడ్డి అత్తమ్మ రాజమ్మ, అంబట్‌పల్లిలో ఉపాధ్యాయుడు నారం రామచంద్రం ఇటీవల మృతి చెందగా బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు జక్కు రాకేశ్‌తో కలిసి ఆ కుటుంబాలను కలిసి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంటన బీఆర్ఎస్ నాయకులు జోడు శ్రీనివాస్, జక్కు శ్రావణ్, నరి వెద్ది శ్రీనివాస్, లక్ష్మయ్య, కోట రమేశ్, కన్నీరు స్వామి, రజాకార్, మహేష్, తాటి రాజ్‌కుమార్, బాపురెడ్డి, పార్టీ మహదేవపూర్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్‌రావు, మాజీ సర్పంచ్ శ్రీపతిబాపు, మంథని నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీత, మహిళా మండలాధ్యక్షురాలు ఓడేటి స్వప్నా మల్లారెడ్డి, సీనియర్ నాయకులు పెండ్యాల మనోహర్, అన్కారీ ప్రకాశ్, వెన్నపురెడ్డి మోహన్‌రెడ్డి, పోత వెంకటస్వామి, కారెంగుల బాపురావు, మండల యూత్ అధ్యక్షుడు అలీం ఖాన్ ఉన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో అరుణ్‌కుమార్‌కు ప్రథమ స్థానం

ములుగురూరల్, సెప్టెంబర్ 30: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ములుగు మండలం అబ్బాపూర్ గ్రామానికి చెందిన మోటపోతుల అరుణ్‌కుమార్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. తెలుగు సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుల విభాగంలో 81.63 శాతం మార్కులు పొంది డీఎస్సీ ములుగు జనరల్ జాబితా ప్రకారం మొదటి స్థానంలో నిలిచారు. గ్రామానికి చెందిన ఆనందంగౌడ్- రాణి కుమారుడు అరుణ్‌కుమార్ డీఎస్సీ పరీక్షల కంటే ముందు తండ్రి మరణించినా మొక్కవోని పట్టుదలతో కష్టపడి చదువుకొని ఉపాధ్యాయ వృత్తిలో చేరాలనే సంకల్పం ఫలించింది. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్‌ను గ్రామస్తులు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల తరపున డాక్టర్ కందాల రామయ్య, నల్లా రాజిరెడ్డి, కైరి సుష్మ అభినందించారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలి

ములుగు జిల్లాలో డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు నేడు డీఈవో కార్యాలయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని డీఈవో పాణిని ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులోని ఫోన్‌నంబర్, మెయిల్ అడ్రస్‌కు మెస్సేజ్ పొందిన అభ్యర్థులు ఉదయం 10గంటలకు కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను పూర్తి చేసుకోవాలని సూచించారు.

నిరుపేద యువకుడికి సరస్వతీ కటాక్షం

- తెలుగు పండిట్‌లో జిల్లా రెండో ర్యాంక్
- ఎస్‌జీటీలో జిల్లా 38వ ర్యాంక్

గుండోజీ నగేశ్

మహదేవపూర్ (కాళేశ్వరం), సెప్టెంబర్ 30: నిరుపేట కుటుంబానికి చెందిన ఓ యువకుడు ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. కాళేశ్వరం గ్రామానికి చెందిన గుండోజీ నగేశ్ సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో తెలుగు పండిత్ పోస్ట్‌లో జిల్లాలో రెండో ర్యాంక్, ఎస్‌జీటీలో జిల్లా 38వ ర్యాంక్ సాధించాడు. గతంలో పలుమార్లు ప్రభుత్వ ఉద్యోగాల పోస్ట్‌లకు పరీక్షలు రాసినా ఫలితం దక్కలేదు. అయినా పట్టుదలతో శ్రమించి చివరకు ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై తల్లిదండ్రుల కళ్లలో ఆనందాన్ని నింపాడు.

దర్యాప్తులను వేగవంతం చేయాలి

ములుగు ఎస్పీ శబరీశ్

ములుగురూరల్, సెప్టెంబర్ 30: పోలీస్‌శాఖలోని అధికారులు ప్రజలతో మర్యాదగా ఉంటూ ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా దర్యాప్తులను వేగవంతం చేయాలని ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్ అన్నారు. నెలవారీ నేర సమీక్ష సమావేశంలో భాగంగా సోమవారం తన కార్యాలయంలో పోలీస్ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. దొంగతనాలు, ఆర్థిక నేరాల్లో ఫిర్యాదు దారులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. జిల్లా ప్రారంభం నుంచి చివరి సరిహద్దు వరకు నలుమూలల 370 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఇంటిగ్రేటెడ్ సీసీ టీవీ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అనుమానాస్పద వ్యక్తులను నిరంతరం పర్యవేక్షిస్తామని, నేర పరిశోధనలో సీసీ టీవీల పాత్ర ప్రాముఖ్యమన్నారు. ప్రజావాణితో పాటు గ్రామసభల్లో పోలీస్‌శాఖకు సంబంధిచి ప్రజల సమస్యలను తెలుసుకొని వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఓఎస్డీ మహేశ్‌బాబా సాహెబ్ గీతే, అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీలు రవీందర్, రాములు, సీఐలు శంకర్, రవీందర్, శ్రీనివాస్, కుమార్, ఎస్సైలు వెంకటేశ్వరరావు, సతీశ్, కమలాకర్, శ్రీకాంత్‌రెడ్డి, తాజొద్దీన్, సూరి, హరీశ్, కృష్ణప్రసాద్, తిరుపతి, వెంకటేశ్, జగదీశ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలం

టేకుమట్ల, సెప్టెంబర్ 30 : రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేశ్ అన్నారు. సోమవారం తహసీల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన తహసీల్దార్ విజయలక్ష్మీకి వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు 40శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసి మిగతా వారికి చేయలేదన్నారు. రేషన్ కార్డు ప్రామాణికం కాదంటూనే కార్డులేని రైతులకు మాఫీ చేయకపోడం దారుణమన్నారు. దసరా నాటికి అందరికీ రుణ మాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కసరవేణ కుమార్, పులి రమణారెడ్డి, చంద్రగిరి శంకర్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

శ్రీరాం రవి (ఫైల్)

చిట్యాల (మొగుళ్లపల్లి), సెప్టెంబర్ 30: మద్యం మత్తులో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మొగుళ్లపల్లి మండలం రంగాపురానికి చెందిన శ్రీరాం రవి (56) వ్యవసాయం చేస్తుంటాడు. మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతుండేవాడు. ఈనెల 29న రాత్రి మద్యం మత్తులో జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు ప్రణీత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

సొసైటీని రద్దు చేయాలి

మంగపేట, సెప్టెంబర్ 30: మండలంలోని తిమ్మంపేట పంచాయతీ పరిధి అబ్బాయిగూడెంలో ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా ఎన్నుకున్న ముక్కుడు పోషమ్మ ఆదివాసీ గిరిజన ఇసుక, మొరం సొసైటీని రద్దుచేసి, తిరిగి ఇక్కడి గిరిజనుల సమక్షంలో ఎన్నిక జరుపాలని స్థానిక ఆదివాసీ సభ్యులు కోరారు. సోమవారం కలెక్టర్, డీసీవో తదితర ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామ సొసైటీ పరిధిలో 250 మంది గిరిజనులుండగా 230 మందికి సమాచారం ఇవ్వకుండా కేవల